## పురుషులకు ప్రత్యేకం




# చెల్లని నోటు

– ఇచ్ఛాపురపు రామచంద్రం

డబ్బేం చేస్తుందో అదే డబ్బంటే–అని డబ్బు నిర్వచనం. బాగానే ఉంది. కాని డబ్బు మనుషుల చేత ఏమేం చేయిస్తుందో వాటినేమనాలి? ప్రభాకరరావ్ ఓ పెద్ద కార్యాలయంలో చిన్న క్లర్కు. ఇప్పటి చాలామంది మనుషులలోలాగే అతనిలోనూ కొన్ని బలహీనతలు. ఐతే–వాటినతడు తెలివితేటలనుకుంటాడు. గొప్పగా కూడా భావిస్తాడు.

"మీరేం చేస్తూంటారు?" అని అతన్నెవరయినా అడిగితే 'ఫలానా సంస్థలో" అని గొప్పదయిన తన సంస్థ పేరు చెబుతాడు. ఉద్యోగమంటాడు తప్ప గుమాస్తా అని బయటపెట్టడు. అత్యవసరమూ అనివార్యము అయితే తప్ప. మధ్య తరగతి మనిషి కనక మిధ్యా గౌరవం కోసం పాకులాడి. అందుకు ఆత్మవంచనకీ, పరవంచనకీ కూడా సంసిద్ధమే. మధ్యతరగతి యువకుడు కనుక పై తరగతి జీవితంమీద మోజు, ఆశలూ అంటే – విలాసాలూ వినోదాల మీద వాంఛలు.

అతను గుమాస్తా కనుక అతని కందేది జీతం. జీతమంటే జీవితానికి చాలనిది. జీవితపు చొక్కాకి జీతం గుడ్డ ఎప్పుడూ తక్కువే ఔతూంటుంది. జీతం స్వభావమది. ఐతే ప్రభాకరరావ్‌కి వెనక అమ్మ ఉంది. కాస్త ఆస్తి ఉంది. అతను భార్యకిచ్చేది వెయ్యి రూపాయలే అయినా నెలాఖరున కూడా వినీల దగ్గర వందో యాభై య్యో మిగిలే ఉంటాయెమో డబ్బుల పెట్టెలో. అయినా ప్రభాకర్‌రావుకి సంతృప్తి ఉండదు. అవసరాలు తీరడమే కాదు కదా జీవితం! అసలు–డబ్బంటేనే ఎంతున్నా చాలనిదని మరో నిర్వచనం.

జీతాల రోజులాగే ఆవేళా జీతమందుకుని–నలుగురు మిత్రులతో ఎదురుగా ఉన్న హొటల్‌లోకి నడిచి ఖరీదయిన స్వీటూ ఐస్ క్రీములతో సహా కడుపు పట్టినంత తిని–కిళ్లీ బిగించి.... సిగరెట్ అంటించి స్వర్గసుఖం అనుభవిస్తున్నట్లు తనని తాను భ్రమ పెట్టుకుని–క్లబ్‌లోకి నడిచాడు.

పేకట... జీతాల రోజు నెలకొకసారే కదా? ఆ వేళయినా అనుభవించకపోతే ఎలా? పున్నమయినా అమావాస్యయినా జీతాల రోజయినా నెలకోసారి మాత్రమే వొచ్చేవికదా? టేబులు బర్నయ్యేసరికి – పేకాటలో లాభమూ వొచ్చింది – అరవయ్యయిదు రూపాయలు. కాని... ఆ యాభై రూపాయలనోటు... త్రుళ్లిపడ్డాడు తను దాన్ని సరిగ్గా చూసుకునే సరికి. "ఎవరో నాకు చెల్లని నోటంటగట్టేరు పొరపాటున. ఇదుగో... తీసుకుని మంచి దిచ్చెయ్యండి" అన్నాడు ప్రభాకర్‌రావు మంచిగానే.

"నాది కాదు." "నేనివ్వలేదు" "నా దగ్గర అసలు యాభై రూపాయల నోటే లేదు.."

"నాకు తెలియదు." అనేశారు మిత్రబృందం.

అతనికి దుఃఖమొచ్చింది. "ఇది చాలా అన్యాయం. నేను కచ్చితంగా చెబుతున్నాను. మీలో ఎవరో యిచ్చారు. నేను తాగేసి చెప్పడం లేదు. ఒక్క యాభై రూపాయలకోసం కక్కుర్తి పడకండి చెల్లని డబ్బులు పేకాటకనే పాడుపేరు తేకండి. స్నేహానికి ద్రోహం చేయకండి. మైత్రి నవమానించకండి వెధవ డబ్బుకోసం. పాపిష్టి డబ్బు మన ఫ్రండ్‌షిప్‌ని పాడుచెయ్యకూడదు." ప్రాధేయపడ్డాడు. వేడుకున్నాడు. ప్రయోజనం లేకపోయింది. చెల్లనినోటుని జేబులో వేసుకుని... స్నేహితులని తిట్టుకుంటూ యింటికి బయలుదేరాడు.

ఏభై రూపాయలకి ముఖం చూసుకున్నారు. స్నేహాన్ని మరిపించేసింది పాపిష్టి డబ్బు. పేకాటలో లాభం వొచ్చిందన్న అనందాన్ని తినేసింది చెల్లని నోటు. ఏభై రూపాయలు... ఎవడు తిన్న సొమ్ము? ఏభై రూపాయలంటే రాస్కెల్స్! ఇక నుంచి డబ్బు దగ్గర ఎవరినీ నమ్మకూడదు. నోటు చూసి మరీ తీసుకోవాలి అవతలి వాడెంత స్నేహితుడయినా సరే. అది – భవిష్య జాగ్రత్త. ప్రస్తుతం – యీ నోటుని సొమ్ము చేసుకోడం ఎలా?

నోటుని తీసి చూశాడు. నోటు నవ్వుతున్నట్లనిపించింది. "చూశావా, నా మహిమ? డబ్బు ముందు నో ఫ్రండ్షిప్... నథింగ్..." అంటూ.

"ఊఁ ... జీతం తెచ్చారా?" అంటూ ఎదురొచ్చింది వినీల.

"లేకపోతే నువ్వూరుకుంటావా? కొంచెం మంచి నీళ్లు పట్రా"

"మంచి నీళ్లకి కాళీ ఉంచారన్నమాట మంచివారే." అంటూ ఆమె లోపలికి వెళ్లింది. అంతలో అతనికొక ఆలోచన వొచ్చింది, లోవోల్టేజివల్ల డిమ్‌గా వెలుగుతున్న దీపాలు చూసేసరికి. వినీలకి వెయ్యి రూపాయలిస్తాను, నేను రెండువందలు నా ఖర్చుకుంచుకుని, ఆమె ఎలాగూ అంతా ఖర్చు చెయ్యదు. కొంత దాచేస్తుంది. అంటే – కొంత డబ్బు వినియోగపడదు. ఈ ఏభై రూపాయలనోటు ఆమెకిచ్చే వాటిలో పెట్టేస్తే... గ్రహించలేదు. ఖర్చు చెయ్యకుండా డబ్బాలో ఉంచుకుందుకు చెల్లే నోటయితేనేం, చెల్లని నోటయితేనేం? కాని... తప్పేమో... కట్టుకున్న భార్యని మోసం చేయడమా! ఏభై రూపాయల కోసం దాంపత్యాన్నీ భార్యాభర్తల అనుబంధాన్నీ అవమానించడమా! దిగజార్చడమా. ప్చ్... ఇందులో ఘోరమేముంది నేననవసరంగా

యిదయిపోతున్నానుకాని, వినీల రకరకాల లావా దేవీలు జరుపుతుంది. ఎవరెవరివో డబ్బులూ - యిచ్చిపుచ్చుకోడాలూ... ఈ నోటు నేనామె కిచ్చినా ఆమె దగ్గరుంటుందా ఏమన్నానా? ఆమె దాన్ని మళ్లీ ఎవరికో యిచ్చేస్తుంది. అంచేత... తప్పు లేదు. ఆడవాళ్ళిచ్చే నోట్ల నెవరూ అనుమానించరు, అనుకుంటూ అతనా నోటుని భార్యకిచ్చే డబ్బుల్లో కలిపేశాడు. ఆమెకందించేశాడు "లెక్క సరిగా ఉందా?"

"ఊఁ... దీపాలు సరిగా వెలగడంలేదు. కానీ... పర్లేదు.." అంటూ ఆమె ఆ వెయ్యిరూపాయలూ లెక్కపెట్టుకుని తనవద్ద వున్న డబ్బులో కలిపేసి - ఏ నోట్లకానోట్లు - ఐదులూ పదులూ... ఏభై లూ అలాగ బొత్తులు పెట్టి డబ్బాలో దాచేసింది. భోంచేసి పడుకున్నా ప్రభాకరానికా రాత్రి నిద్రపట్టలేదు. ఆ నోటు చీటికీ మాటికీ కలలోకి రావడమూ 'చూశావా, నేను స్నేహంకంటేనే కాదు, దాంపత్యం కంటేకూడా గొప్పదాన్ని.' అంటూ అతన్నెద్దేవా చేయడమూ ఏడిపించడమూ. ఇంక నిద్రేం పట్టి చస్తుంది; కలత నిద్రతోనే తెల్లవారింది.

తెల్లవారాక... పనులన్నీ ముగించుకుని... భర్తని ఆఫీసుకి పంపేసి... తీరిగ్గా డబ్బుల డబ్బా ముందేసుకు కూర్చుంది వినీల. అప్పుడు కంట పడిందా నోటు. పైకి బాగానే ఉన్నా అది చెల్లనిదని గ్రహించడానికామె కాట్టేసేపు పట్టలేదు. చెల్లని... యాభై రూపాయల నోటు... యాభై రూపాయలు బూడిదలో పోసిన పన్నీరేనా? నష్టమేనా? ఎవరిచ్చారో యీ మారని నోటు? ఏమో... సహాలక్ష వ్యవహారాలాయె. శతకోటి బోడిలింగాల్లో యిదే బోడిలింగమో ఎలా తెలిసి చస్తుందిప్పుడు? ఇదెవరిచ్చారో కనుక్కోడం అయ్యేపని కాదు కానీ... అది తనకెవరో ఎలా అంటగట్టారో ... అలాగే తనూ మరొకరి కంటగట్టడమే మార్గం. తనెందుకు నష్టపోవాలి వొట్టిపుణ్యానికి? తనెందుకు ఏభై రూపాయలు చేతి చమురు వొదుల్చుకోవాలి? వారు కాని యివ్వలేదు కద? ఛ... వారు తననెందుకు మోసం చేస్తారూ? తనేమన్నా పరాయిదా? పెళ్లాన్నే దగా చేస్తారా పాడు యాభై రూపాయల కోసం?

"అమ్మా!" కూరలమ్మి పిలుపు. చటుక్కున ఆలోచన వొచ్చింది వినీలకి. చెల్లనినోటు పట్టుకుని వరండాలోకి నడిచింది. "నీ బాకీ కింద జమేసుకో." అంటూ అందించింది.

"ఈ నోటు సరిగలేదమ్మా. మరోటి... మంచి దిప్పించండి."

"దీనికేమొచ్చిందీ?" తేలుకుట్టిన దొంగలా దాన్ని తీసేసుకుని మరొకటిచ్చేసి లోపలికి పరుగెత్తింది ముఖం చూపలేనట్లు.

పాలమనిషి మీద కూడా ప్రయోగించబోయింది. కాని - అదీ పసికట్టేసి... "ఎవరో యెదవలు మీకు మాయదారి నోటంటగట్టేసినారు. డబ్బులు తీసుకునేటప్పుడు చూసి తీసుకోవాలమ్మా. అందునా... ఒకటా, రెండా, యాభై రూపాయలు. ఎవరిచ్చారో ఏటో తమరికి. ఆళ్లసేతులడిపోనూ... మరో మంచి నోటిప్పించు తల్లీ" తప్పు చేసిన దానిలా తలొంచుకుని... మంచినోటిచ్చి... నకిలీ నోటు చెల్లకపోడంతో... దాన్ని చేతులు మార్చడమెలాగా అని బుర్ర బద్దలు కొట్టుకుంటూంటే... "అమ్మాయ్..." అంటూ వొచ్చిందత్తగారు వంట ముగించుకుని. "జీతాలొచ్చాయా? అబ్బాయి డబ్బులిచ్చాడా?"

వినీల మెదడులో మెరుపు మెరిసింది. అత్తగారికి చత్వారం. మడిలో అని కాబోలు కళ్లజోడు పెట్టుకోలేదు. ఆవిడకి తను బాకీ ఉంది కనుక సందులో సందుగా యీ నోటు నామెకిచ్చేస్తే?... తప్పేమో ... పాపమేమో... అత్తగారు... దృష్టిసరిగా ఆననివారు... ఇలాటి నోటిస్తే మోసం చెయ్యడమే ఔతుందేమో. పాపమేమో...

గాడిద గుడ్డు... ఈ రోజుల్లో పాపమూ పుణ్యమూ ఎక్కడున్నాయి డబ్బు తప్ప? తనకది అంటగట్టిన వాళ్లు పాపమని చూశారేమిటి? తనూ అంతే చేస్తుంది. తప్పేమిటట? ఒకటా, రెండా? ఏభై రూపాయలకి తనెందుకు మునగాలి?

"ఇవిగో మీకివ్వవలసిన నూటరవయ్యి."

"భగవద్గీతలో ... మునుపటి డబ్బులతో పాటు వీటినీ పెట్టు-" అంటూ దేముడి గదిలోంచి భగవద్గీత తెచ్చి అందించింది.

"లెక్కచూడండి-"

"నువ్వు చూస్తే చాలదూ? నేనెందుకూ చూడడం మళ్లీ? నీ మీద నాకు నమ్మకమేలేో" నవ్వారావిడ.

తన తల తీసి ఎక్కడ పెట్టుకోవాలో అనిపించింది వినీలకి. ఎంతో నమ్మిన అత్తగారిని పెద్దవారిని మోసం చేయవలసి వొచ్చిందే అనుకుంటూ ఓ క్షణం చింతించి అంతలోనే ఆ విషయం వొదిలేసింది. ఏభై రూపాయల నోటు విజేతలా నవ్వుకుంది. డబ్బు ముందు పెద్దరికం పట్ల గౌరవమూ, బంధుత్వమూ అన్నీ హుష్‌కాకే.

మధ్యాహ్నం నిద్రయ్యాక ముసిలావిడ తీరిగ్గా భగవద్గీత లోంచి డబ్బు తీసి లెక్కపెట్టకోసాగింది. అది ఆవిడ దినచర్యలో భాగం. ఒక్కొక్క నోటూ ఒకటికి పదిసార్లు చాదస్తంగా చూసి... నాలుగుసార్లు లెక్కవేసుకోడం - ఆవిడకు ఓ రకంగా కాలక్షేపం. అలా తీరిగ్గా నోట్ల బొత్తి లెక్కెడుతూంటే - వాటి మధ్య ఆ చెల్లని నోటు! ఆవిడ గుండె గుభేలుమంది. ప్రాణం పోయినట్లే అనిపించింది.



అరటిపండ్లను ఎప్పుడూ ఫ్రిజ్‌లో ఉంచకూడదు. ఉంచితే అరటిపండ్లపై తోలు నల్లబడుతుంది.

ఒకటా రెండా యాభై రూపాయలు. ఎవరు తిన్నది? దీనిని మార్చడం ఎలా? ఎవరికివ్వాలి? ఎలా వొదుల్చుకోవాలి? గిలగిలలాడిపోయింది వృద్ధురాలు.

సరిగ్గా అప్పుడు... దేవుడే పంపించినట్లు కోవెల పూజారి.

"అమ్మా! రేపు శనిత్రయోదశి. అభిషేకం చేయిస్తారని వొచ్చాను."

"నేనూ అందుకే ఎదురు చూస్తున్నాను. ఇదిగో... యీ యాభయ్యి ఉంచి రేపు శనీశ్వరుడికి ఘనంగా అభిషేకం జరిపించండి-"

పూజారి చేతికి మారిన, మారని నోటు మళ్లీ మందహాసం చేసింది. డబ్బు ముందు భక్తి కూడా బలాదూరే.

శనిత్రయోదశి నాటి మధ్యాహ్నం గుడి హడావిడులయిపోయాక తీరిగ్గా మిగులు లెక్కలు చూసుకుంటున్న పూజారి - తన వద్ద డబ్బులోని మారని ఏభై నోటుని చూసి లబోదిబోమన్నాడు. ఎవరేమిచ్చినా చూడకుండా సంచిలో వేసుకోడమే తప్ప - వారెలాటినోటిచ్చారని చూసుకోకపోవడం తన పొరపాటే. ఏ 'మహాభక్తుడో' 'భక్తురాలో' యీ మారని నోటిచ్చారు. దీనిని ఏం చేయాలి?

అతనికి ఉపాయం స్ఫురించింది. పెద్ద వీధి శెట్టిగారు హుండీలో వేయమని ఏభై రూపాయలిచ్చారు. తానింకా ఆ డబ్బుని హుండీలో వేయలేదు. ఈ ఏభై నోటుని దేవుడి హుండీలో వేసేస్తే... ఎవరు చూడొచ్చారు తనే వేశాడని? దేముడి కళ్లు కప్పడం... ద్రోహం.. ఏం కాదు. తను నిమిత్తమాత్రుడు. ఎవరో దైవకార్యానికని యిచ్చిన యీ చెల్లని నోటుని తను దైవకార్యానికే వినియోగిస్తున్నాడు కదా? ఈ మారనినోటూ భగవంతుడి సృష్టేకదా? అతను ఆ నోటుని హుండీలో వేసేసి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

ఇప్పుడా చెల్లని నోటుకి పట్టపగ్గాలు లేకపోతున్నాయి. తన ముందు భగవంతుడు కూడా ఓడిపోయినట్లే. ఎంత గొప్పది తను!

నిజమేనేమో. చెల్లని నోటే - స్నేహాన్ని, దాంపత్యాన్ని, బంధుత్వాన్ని, పెద్దరికాన్ని, భక్తిని, భగవంతుడిని సునాయాసంగా జయించేసి మనుషులని వంచకులనీ, దగాకోర్లనీ, మోసగాళ్లనీ చేసి వారి విలువలనింతగా దిగజార్చగలిగితే చెల్లే నోటింకెంత చేటు చెయ్యగలదో మరి!